క్లుప్తంగా

కంప్యూటర్, టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కంచరపాలెం: కంచరపాలెం అశోక్‌నగర్‌లోని బౌద్ధాలయంలో ఆంధ్రా బౌద్ధ సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 22 నుంచి మహిళలకు టైలరింగ్, యువతకు కంప్యూటర్ కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు ముందుగా దరఖాస్తులు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 96760 30455 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సాయిమందిరంలో ప్రత్యేక పూజలు



పూజలందుకున్న సాయిబాబా

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఏపీఎస్ఈబీ కాలనీలోని శ్రీ షిర్డీసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం బాబాకి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అలంకరణ అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం నక్షత్ర హారతి అత్యంత కోలాహలంగా సాగింది. భక్తుల సాయి సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. ఆ తర్వాత బాబావారికి వైభవోపేతంగా పల్లకీ సేవ నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షులు విల్లా సత్యనారాయణ రావు తగిన ఏర్పాట్లు చేశారు. భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఆలయ సమీపంలో నాగుల చవితి పార్కు అభివృద్ధి చేస్తున్నందున, భక్తులు తోచిన రీతిలో విరాళాలు అందించి, బాబా సేవలో తరలించాలని కోరారు.

యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఉక్కు మహిళలు



రికార్డ్ సాధించిన మహిళలతో స్టీల్‌ప్లాంట్ సీజీఎం ప్రకాశ్

ఉక్కునగరం: యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో ఉక్కునగరం మహిళలు స్థానం సాధించారు. యోగాసన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ ఆధ్వర్యంలో ఈ నెల 9న నగరంలోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా నిర్వహించిన యోగాసన పోటీల్లో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వందలాది మంది పాల్గొన్నారు. ఉక్కు స్టేడియంలోని యోగా అభ్యాసకులు వెంకట శ్యామల, ఎస్.విజయలక్ష్మి, బి.ఉమాదేవి సూర్య నమస్కారాల విభాగంలో పాల్గొన్నారు. వీరు ముగ్గురూ 216 రౌండ్లను 88 నిమిషాల్లో పూర్తి చేసి వరల్డ్ రికార్డ్ బుక్‌లో స్థానం సాధించారు. ఈ సందర్భంగా గురువారం ఉక్కు స్టేడియంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీజీఎం డాక్టర్ కె.హెచ్. ప్రకాశ్, ఎస్.విజయలక్ష్మి, బి.ఉమాదేవిలను అభినందించారు.

తీరానికి కొట్టుకొచ్చిన భారీ తాబేల కళేబరం



కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు చేపలుప్పాడ తీరం వద్దకు గురువారం భారీ తాబేలు కళేబరం కొట్టుకొచ్చింది. ఇక్కడి మత్స్యకారులు గమనించి వెళ్లి చూసేసరికి మృత్యువాత పడ్డట్లు తెలిపారు. ఇంత పెద్ద తాబేలును మునుపెన్నడూ చూడలేదని మత్స్యకారులు తెలిపారు. సముద్రంలో పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో మత్స్య జీవరాశులు మృత్యువాత పడుతున్నట్లు తెలిపారు. ఇటీవల మంగమారిపేట బీచ్ వద్ద భారీ డాల్ఫిన్, తాబేలు కళేబరాలు కొట్టుకొచ్చిన సంఘటన తెలిసిందే. వరుస సంఘటనలతో మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ముందే వచ్చిన సంక్రాంతి

- పశ్చిమ నియోజకవర్గంలో ఘనంగా సంబరాలు
- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో వేడుకలు
- ముగ్గుల పోటీల్లో పాల్గొన్న 3,200 మంది మహిళలు



సంక్రాంతి సంబరాల్లో మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలతో సందడిగా మారిన గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్



డూడూ బసవన్నలతో వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, ఆడారి ఆనంద్ కుమార్, సోహెల్ తదితరులు

గోపాలపట్నం: విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో సంక్రాంతి మూడు రోజుల ముందే వచ్చేసింది. గోపాలపట్నం హైస్కూల్ గ్రౌండ్‌లో వైఎస్సార్ సీపీ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల ఫైనల్స్ గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రి అమర్‌నాథ్, యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పీలా రమాకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వేడుకలు కన్నుల పండువగా సాగాయన్నారు. ఎంతో మంది మహిళలు ఉత్సాహంగా ముగ్గుల పోటీల్లో పాల్గొనడం చూడ ముచ్చటగా ఉందన్నారు. నియోజకవర్గం మొత్తంగా మూడు వేల మంది మహిళలు పాల్గొనడం చాలా గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతుల కుటుంబాల్లో సంక్రాంతి వెలుగులు నింపారన్నారు. వారు వ్యవసాయంలో ప్రగతి సాధించేందుకు పలు చర్యలు చేపట్టారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. ప్రజల ఆశీస్సులతో మళ్లీ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అవుతారని, మన ప్రభుత్వమే వస్తుందని తెలిపారు. మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్‌లోనే రైతు ఉన్నాడని, వారే లేకపోతే మనం లేమన్నారు. అన్నదాతల అభ్యున్నతి కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని కొనియాడారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలుపొందిన 210 మందికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, పలు వార్డుల కార్పొరేటర్లు, పార్టీ వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అలరించిన బిగ్ బాస్ ఫేమ్ సోహెల్

సంక్రాంతి సబరాలకు హాజరైన బిగ్ బాస్ ఫేమ్ సోహెల్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాడు. ఆయన రాగానే మహిళలు, అభిమానులు చుట్టుముట్టారు. మహిళలు వేస్తున్న ముగ్గులను ఆడారి ఆనంద్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం సోహెల్ మాట్లాడుతూ త్వరలో విడుదల కానున్న తన సినిమా బూట్ కట్ బాలరాజును ఆదరించాలని కోరారు. అనంతరం కొద్దిసేపు ఇక్కడ గడిపి వెళ్లిపోయారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఇక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. రైతుల వ్యధలు, పంట పండిన తర్వాత ఇంటికి చేర్చిన ఆనందం వంటి సన్నివేశాలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. చిన్నారుల కోలాటాలు, రేలా రేలా పాటలు డ్యాన్సులతో చూపరులను ఉర్రూతలూగించారు.



కోలాటమాడుతున్న చిన్నారులు



పల్లె వాతావరణంతో ఏర్పాటు చేసిన సెట్



జగనన్న నవరత్నాల ముగ్గు



భూమిని కాపాడుకుందాం అంటూ వేసిన ముగ్గు



ముగ్గులను పరిశీలిస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్, రమా కుమారి

పశ్చిమలో వైఎస్సార్‌సీపీ బలోపేతంపై సమీక్ష



వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డితో సమావేశమైన జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు పశ్చిమ నాయకులు ఆడారి ఆనంద్‌కుమార్, మళ్ల విజయప్రసాద్, బెహరా భాస్కరరావు తదితరులు

అల్లిపురం: విశాఖ పశ్చిమ నియోజకవర్గ నాయకులతో వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి గురువారం ఎండాడలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. పార్టీ బలోపేతంపై చర్చించారు. పార్టీ విశాఖ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే మళ్ల విజయప్రసాద్, డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ముఖ్య నాయకులు బెహరా భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్న ఆరోగ్య సురక్ష’తో ప్రజలకు మేలు



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



60వ వార్డులో రోగులకు మందుల కిట్ అందిస్తున్న నాయకులు

గోపాలపట్నం: గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పరిసర ప్రాంతాల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి వైద్యులు మందులు అందించారు. లక్ష్మీనగర్ యూపీహెచ్‌సీ వైద్యురాలు పూజ శిబిరాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య శిబిరాలతో ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో 92వ వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్తేర్ హెప్సిబా, సచివాలయం కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

60వ వార్డులో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’

మల్కాపురం: జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీ పరిధి సచివాలయం వద్ద గురువారం ఉదయం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. పలువురు వైద్య నిపుణులు పాల్గొని శిబిరానికి వచ్చిన రోగులకు అవసరమైన వైద్య పరీక్షలు చేసి, మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు ఆడారి హరీష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్క నిరుపేద ఆరోగ్యంగా ఉండాలన్న ఆలోచనతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శరగడం పత్నిరావు, గుంట సుందర్రావు, హనుమంత రావు, సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఏయూ భూముల పరిరక్షణకు తక్షణ చర్యలు

- అంగుళం భూమి కూడా అన్యాక్రాంతం కానివ్వం
- త్వరలో రక్షణ గోడల నిర్మాణం
- వర్సిటీ రిజిస్ట్రార్ జేమ్స్ స్టీఫెన్



నగరంపాలెంలో ఏయూ భూములను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ జేమ్స్‌స్టీఫెన్, తదితరులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం భూముల పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపడుతున్నామని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ అన్నారు. గురువారం మధ్యాహ్నం ఆయన మధురవాడ సమీప నగరంపాలెంలో ఉన్న ఏయూ భూములను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్సిటీకి చెందిన భూమిని, గతంలో ఇక్కడ భౌతికశాస్త్ర సంబంధ పరిశోధనలకు ఉపయుక్తంగా నిర్మించిన భవనం, తదితర వసతులను పరిశీలించారు. తక్షణం ఈ స్థలం చుట్టూ రక్షణ గోడ నిర్మించాలని యూనివర్సిటీ ఇంజినీర్‌ను ఆయన ఆదేశించారు. ఈ ఖాళీ స్థలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇటువంటి వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని రిజిస్ట్రార్ హెచ్చరించారు. ఏయూ స్థలాల చుట్టూ రక్షణ గోడల నిర్మాణం, సెక్యూరిటీ సిబ్బంది నియామకం చేపడతామన్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయానికి సంబంధించిన అంగుళం భూమిని కూడా అన్యాక్రాంతం కాకుండా పరిరక్షిస్తామన్నారు. వర్సిటీ ఆస్తులను ఆక్రమించినా, కబ్జా చేయాలని ప్రయత్నించినా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ మహ్మద్‌ఖాన్, ఇంజినీరింగ్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మానవాళికి మార్గదర్శకాలు మాస్టర్ ఈకే గ్రంథాలు

మహారాణిపేట : అంతర్జాతీయ ఆధ్యాత్మిక, సేవా సంస్థ జగద్గురుపీఠం ఆధ్వర్యంలో అంకోసా ఫంక్షన్ హాలులో గురువారం 63వ మాస్టర్ సీవీవీ గురుపూజా ఉత్సవాలలో మాస్టర్ ఈకే గ్రంథాలు ఆవిష్కరించారు. ఆయన రచించిన స్పిరిట్యువల్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అనే గ్రంథాన్ని కులపతి బుక్ ట్రస్ట్ చైర్మన్ సీహెచ్‌ఎస్ఎన్ రాజు, మాస్టర్స్ అండ్ డిసేబుల్స్ అనే పుస్తకాన్ని చిన్మయ మిషన్ నిర్వాహకులు స్వామి చిద్రూపానంద, సుపర్ణ అనే పుస్తకాన్ని జగద్గురు పీఠం డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాస్టర్ ఈకే రచనలు విజ్ఞాన భాండాగారాలు అన్నారు. ఈ సందర్భంగా జగద్గురు పీఠం జాతీయ ఉపాధ్యక్షులు ఎస్.వి.ఎస్ మూర్తి దంపతులు చిన్నారులకు అన్నప్రాశన నిర్వహించారు. ఉదయం కామన్ ప్రేయర్, నారాయణ హోమాన్ని ధనిష్టా ఫౌండేషన్ ప్రధాన నిర్వాహకులు కంభంపాటి గురుప్రసాద్ నిర్వహించారు . సంగీత జనకులం విద్యార్థులు చేసిన బృందగానం హృద్యంగా సాగింది. మాస్టర్ ఈకేకు నీరాజనంతో మొదటి రోజు గురుపూజోత్సవాలు ముగిసాయి.

ముగిసిన రిలే నిరాహార దీక్షలు



నిమ్మకాయ నీళ్లు అందిస్తున్న నాగభూషణం, మంత్రి రాజశేఖర్

గోపాలపట్నం: నూతన పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నేవల్ ఆర్మమెంట్ డిపో మెయిన్ గేటు వద్ద నేవల్ ఆర్మమెంట్ సివిలియన్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నాలుగు రోజులుగా చేపట్టిన రిలే నిరాహార దీక్ష నేటితో ముగిసింది. శిబిరం వద్ద జిల్లా ఐఎన్‌టీయూసీ కార్యదర్శి నాగభూషణం, జాతీయ కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నిమ్మకాయ నీళ్లు అందించి దీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మారయ్య, మహంది, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు

ఆనందపురం : మండలంలోని వేములవలస జాతీయ రహదారిపై గురువారం మోటార్ బైక్ అదుపుతప్పి బోల్తాపడిన సంఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి. పద్మనాభం మండలం గంధవరం గ్రామానికి చెందిన నెలివాడ ఈశ్వరరావు (40) జేసీబీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. మండలంలోని బోయిపాలెంలో బుధవారం రాత్రి పనిచేశాడు. గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై బయలుదేరి గంధవరం వెళ్తుండగా... ఆనందపురం ఫ్లైఓవర్‌కు సమీపంలోకి చేరుకునే సరికి ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో ఈశ్వరరావు తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే 108 వాహనంలో చికిత్స కోసం కేజీహెచ్‌కు తరలించారు. ట్రాఫిక్ ఎస్ఐ అప్పలరాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘సీఐటీయూ ఉనికికే ఈ సమ్మె’

డాబాగార్డెన్స్ : సీఐటీయూ (సిటు) తన ఉనికి కోసమే పారిశుధ్య కార్మికుల్ని సమ్మెలోకి దించిందని, సమ్మె కారణంగా సాధించిందేంటో తెలపాలని జీవీఎంసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు వీవీ వామనరావు పేర్కొన్నారు. యూనియన్ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సమ్మె చేసిన కొన్ని కార్మిక సంఘాలు అవి సాధించలేకపోయాయని, సమ్మె వల్ల కార్మికుల్లో నిరుత్సాహం ఏర్పడిందన్నారు. తాత్కాలిక సమ్మె విరమణ అని రాష్ట్ర నేతలు చెబుతుంటే.. జిల్లాలో విజయోత్సవ సభలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కార్మికుల్ని మభ్య పెట్టేందుకే సిటు, ఏఐటీయూసీ ఉన్నాయన్నారు. తమ ప్రభుత్వం (జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం) కార్మికులు, ఉద్యోగుల పక్షాన ఉంటుందని, వారి సమస్యలు పరిష్కరించడంలో ఎల్లప్పుడూ కృషి చేస్తున్నప్పటికీ కొంత మంది కావాలనే సమ్మె పేరిట కార్మికులను విచ్ఛిన్నం చేస్తున్నారని ఆరోపించారు.

కనకమహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి



సామూహిక కుంకుమ పూజలో పాల్గొన్న మహిళలు

డాబాగార్డెన్స్ : పాతనగరంలోని కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకా పరమేశ్వరి ఆలయంలో మార్గశిర మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా గురువారం అమ్మవారిని కనకమహాలక్ష్మిగా అలంకరించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించారు. ఆలయ మండపంలో ప్రధాన అర్చకుడు ఆర్‌బీబీ కుమార్ శర్మచే 250 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిపారు. దేవాలయ సంఘం అధ్యక్షుడు అరిసెట్టి దినకర్, కార్యదర్శి గ్రంధి రామకృష్ణారావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు వెదుళ్లపల్లి శ్రీనివాసరావు, కేవీ రమణయ్య, పూసర్ల సంజీవి పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



సంతకం చేస్తున్న కార్పొరేటర్ రమణ

విశాఖ విద్య: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ అన్నారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహం నిర్మించినందుకు ప్రభుత్వ చర్యలకు మద్దతుగా వార్డు పరిధిలోని 468, 469, 470, 473 సచివాలయాల్లో గురువారం సంతకాల సేకరణ చేపట్టారు. అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అంబేడ్కర్ 125 అడుగుల భారీ విగ్రహం విజయవాడలో నిర్మించటం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల అడ్మిన్లు ఫణి, వెంకటేష్, ఈశ్వర్, అనిత, అన్ని విభాగాల కార్యదర్శులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

58వ వార్డులో ‘ఆడారి’ పింఛన్ల పంపిణీ



లబ్ధిదారుడికి పింఛన్ అందిస్తున్న నాయకులు

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ సొంత నిధులతో అందిస్తున్న పింఛన్ల పంపిణీ కార్యక్రమం జీవీఎంసీ 58వ వార్డు పిలకవానిపాలెంలో గురువారం జరిగింది. పలువురు నిరుపేదలకు పార్టీ వార్డు అధ్యక్షుడు డి.శ్రీనివాసరాజు, తదితర నాయకులు పింఛన్ అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన ఆడారి ఆనంద్‌కుమార్ దృష్టికి సాంకేతిక సమస్య కారణంగా ప్రభుత్వ పింఛన్ రాలేదని పలువురు పేదలకు తీసుకెళ్లారని చెప్పారు. దీనిపై స్పందించిన ఆనంద్‌కుమార్ ప్రభుత్వం నుంచి సామాజిక పింఛన్ మంజూరయ్యే వరకు సొంత నిధులతో పింఛన్ అందిస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇందులో భాగంగా గురువారం పలువురికి పింఛన్ సొమ్ము అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కోటా కృష్ణ, సత్యనారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దాబాలో అగ్నిప్రమాదం

రూ. 9 లక్షల ఆస్తి నష్టం



ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైన దాబా లోపలి భాగం

మల్కాపురం: అర్ధరాత్రి సమయంలో ఓ దాబా నుంచి మంటలు ఎగసిపడ్డాయి. దీంతో ఆ సమయంలో అటుగా వెళ్తున్న వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో వారు మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే దాబాలోని సామగ్రి పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం సేవా మార్గంలో 63వ వార్డు ప్రాంతానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు సోమాదుల సురేష్‌కు చెందిన దాబా ఉంది. రోజూ మాదిరిగానే బుధవారం రాత్రి వ్యాపారం ముగించుకుని షాపు యజమానితోపాటు, అందులో పని చేస్తున్న వారు ఇళ్లకు వెళ్లిపోయారు. రాత్రి 12 గంటల సమయంలో ఆ షాపు షెట్టర్ దిగువ భాగం నుంచి మంటలు రావడంతో అటువైపు వెళ్తున్న వారు గమనించి అగ్నిమాపక కేంద్రానికి సమాచారమిచ్చారు. అయితే సిబ్బంది అక్కడకు చేరుకునేలోపే షాపులోని విలువైన ఫర్నీచర్‌తోపాటు వంట సామగ్రి, ఎలక్ట్రానిక్ పరికరాలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న యజమాని ప్రమాద స్థలికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. విచారణ అనంతరం వివరాలు వెల్లడిస్తామని అధికారులు చెప్పారు. విషయం తెలుసుకున్న కార్పొరేటర్లు గుండపు నాగేశ్వరరావు, పి.వి.సురేష్, కొణతాల సుధ, బల్లా లక్ష్మణరావుతో పాటు ఇండస్ట్రియల్ ఏరియా ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు పుర్రె సురేష్‌యాదవ్, నగర కార్యదర్శి శరగడం పత్నిరావు తదితరులు ఘటన స్థలికి చేరుకుని సురేష్‌ను ఓదార్చారు.

మెట్ల మీద నుంచి జారిపడి కాంట్రాక్ట్ కార్మికుడి మృతి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో మెట్లు దిగుతుండగా జారిన ప్రమాదంలో ఓ కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన సమాచారం మేరకు వివరాలివి.. పార్వతీపురానికి చెందిన వి.రవికుమార్ (46) కుటుంబంతో పెదగంట్యాడలో నివసిస్తున్నారు. స్టీల్‌ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో పని చేస్తున్న రవికుమార్ గురువారం విభాగంలోని ఎయిర్ కంప్రెషర్ ప్లాంట్‌లో ఎత్తులో పని చేసి దిగి వస్తుండగా కాలు జారి కింద పడిపోయారు. గాయపడిన ఆయన, పక్కన ఉన్న స్విచ్ గేర్ రూమ్‌లోకి వెళ్లి పడుకున్నారు. కొద్దిసేపటి తర్వాత సహ కార్మికులు వెళ్లి చూడగా, నోట్లోంచి నొంగ, రక్తం వస్తూ స్పృహ లేకుండా పడి ఉన్నారు. వెంటనే అంబులెన్స్‌లో మెయిన్ గేటు వద్ద ఉన్న ప్రాథమిక చికిత్సా కేంద్రానికి తరలించగా.. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. సమాచారం తెలిసిన స్టీల్‌ప్లాంట్ సీఐ వి.శ్రీనివాసరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ సిహెచ్.వి.మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.